


'తెలుగు భాష ప్రాచీన హోదా - విజయం - బాధ్యత' అనే అంశంపై రవీంద్ర భారతిలో తానా నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర పౌల్ట్రీ, పశు సంవర్ధక శాఖ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు భాష హోదా కోసం బయట ఎలా విజయం సాధించింది, అంతర్గతంగా ఎలా విజయవంతం కావాలన్న అంశాన్ని ప్రస్తావించారు. 'రచ్చ గెలిచాం... ఇక ఇంట గెలవాలి' అని ఆయన అన్నప్పుడు రవీంద్ర భారతి ఆడిటోరియం చప్పట్లు, హర్షధ్వానాలతో మారుమోగింది. తెలుగు భాషను తరతరాలకు నిలుపుకోవాల్సిన బాధ్యత కేవలం ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలది మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ ఈ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సభను ప్రారంభించిన హాజరైన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత మీడియా, ప్రముఖంగా టీవీలో తెలుగు భాషను ఖూనీ చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలు సహా ప్రతి చోటా తెలుగుభాషా వాడకం ఆవశ్యకతను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

తెలుగుభాషలోని వివిధ అంశాలను, భాష విషయంలో మనం నిర్వహించాల్సిన బాధ్యతల గురించి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి డాక్టర్ ఆవుల మంజులత, ప్రస్తు వి.సి. డాక్టర్ భూమయ్య, కవి, రచయిత, చిత్ర దర్శకుడు జొన్నవిత్తుల, జానపద రచయిత అందెశ్రీ, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు ధర్మారావు విపులంగా ప్రస్తావించారు.